జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 22 | ఆగస్టు | 2026 • పేజీలు : 4

# హాస్టళ్లకు నెల రోజులు.. కాలేజీకి డిసెంబర్

- కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల పనులపై కలెక్టర్ పరిశీలన



**పాల్వంచ, ఆగస్టు 21, ప్రజాజ్యోతి :** కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పాల్వంచ మండలంలో నిర్మిస్తున్న వైద్య కళాశాల నిర్మాణ పనులను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కేపీసీ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారావుతో కలిసి పనుల పురోగతిని తెలుసుకున్నారు. బాయ్స్, గర్ల్స్ హాస్టళ్లతో పాటు తరగతి గదులు, ల్యాబొరేటరీ, ఆసుపత్రి తదితర నిర్మాణ

మిగతా 2 లో...



# నడక నరకయాతనే

- 15వ వార్డులో జలమయమైన రహదారులు..
- మోకాళ్ల లోతు నీటితో ప్రజల అవస్థలు
- రోడ్లన్నీ జలమయం
- నిల్వ ఉన్న మోకాళ్ల లోతు నీరు
- వర్షం, మురుగునీటితో దుర్భర పరిస్థితి
- దోమలు, ఈగలతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం
- సమస్య పరిష్కారానికి ప్రజల వేడుకోలు
- అధికారులు స్పందించేనా?

**ఇల్లందు, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి)** ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో ప్రజలకు నడక నరక యాతనగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలతో వార్డులోని రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీటితో పాటు మురుగునీరు రోడ్లపై నిలిచిపోతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందల సంఖ్యలో సంచరించే ప్రజలు ఈ నీటి నిల్వ వల్ల అనేక ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మోకాళ్ల లోతు నీటితో అవస్థలు**

మున్సిపాలిటీలోని 15వ వార్డులోని స్నేహ డిగ్రీ కళాశాల వద్ద, అదేవిదంగా స్నేహ డిగ్రీ కళాశాల వెనుక మోకాళ్ల లోతు వరకు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఈ మార్గంలో నడవాలంటే

మిగతా 2 లో...





# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

## రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

- పరిహారం, పునరావాస ప్రక్రియలను సత్వరం పూర్తి చేయాలి
- పెండింగ్ భూసేకరణకు రూ.2,800 కోట్ల విడుదలకు చర్యలు

**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 21, (ప్రజాజ్యోతి)** జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాస ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాసం తదితర అంశాలపై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం కలెక్టరేట్ నుండి ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెం డింగ్

మిగతా 2 లో...

# భూసేకరణ ప్రక్రియలో రైతులతో సమన్వయం చేసుకోవాలి

- వారం రోజుల్లోగా భూ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 21,(ప్రజాజ్యోతి)** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, భూ సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రపురం, కారుకొండ రెవెన్యూ గ్రామాల పరిధిలో జరుగుతున్న భూ సర్వే పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్, భూముల వివరాలు, సర్వే పురోగతి, డిస్ట్రిబ్యూటరీ

మిగతా 2 లో...

# కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 21, (ప్రజాజ్యోతి)** పాల్వంచ మండలంలో నిర్మిస్తున్న కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న వివిధ బ్లాకులను కలెక్టర్ పరిశీలించారు. బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్, తరగతి గదులు, ల్యాబొరేటరీ బ్లాక్ తదితర ప్రాంతాలను పరిశీలించి, ఆయా పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాల మేరకు నాణ్యతతో చేపట్టడంతో పాటు, ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రస్తుతం వైద్య కళాశాల

మిగతా 2 లో...

## హాస్టళ్లకు నెల రోజులు.. కాలేజీకి డిసెంబర్

(మొదటి పేజీ తరువాయి...)

పనులను పరిశీలించిన కలెక్టర్..హాస్టళ్ల పనులను నెలరోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని సూచించారు. సుమారు 25 ఎకరాల్లో నిర్మిస్తున్న కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం నర్సింగ్ కళాశాలలో కొనసాగుతున్న బోధన, వసతి, ల్యాబొరేటరీలు తదితర సదుపాయాలపై కూడా కలెక్టర్ ఆరా తీశారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో సంబంధిత అధికారులు, కేపీసీ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారావు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నడక నరకయాతనే

(మొదటి పేజీ తరువాయి...)



జంకుతున్న పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనదారులు సైతం నీటిలోనే ప్రయాణించాల్సి రావడంతో ప్రమాదాల భయం వ్యక్తమవుతుంది.

**వర్షం.. మురుగునీటితో దుర్గంధం**

వర్షపు నీటితో పాటు మురుగునీరు కలవడంతో రోడ్లపై అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుంది. దోమలు, ఈగలు విపరీతంగా పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

**అనారోగ్య సమస్యల భయం**

15వ వార్డులో నిల్వ నీటితో దోమలు వృద్ధి చెందడంతో ప్రజల్లో అనారోగ్యసమస్యలపై ఆందోళన నెలకొంది. పారిశుద్ధ్య చర్యలు చేపట్టినప్పటికి నీరు నిల్వ ఉండడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. తక్షణమే నిల్వ నీటిని తొలగించి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

**అధికారుల స్పందన కోసం ఎదురుచూపులు**

15వ వార్డులో నెలకొన్న వర్షపు నీరు, డ్రైనేజ్ నీరు నిల్వ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రహదారులపై నిలిచిన నీటిని తొలగించడంతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని కోరుతున్నారు. సమస్యను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని, ఇకపై వర్షం పడిన ప్రతిసారీ ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి 15వ వార్డు ప్రజల ఇబ్బందులపై తక్షణమే స్పందించి చర్యలు చేపడతారా? లేక సమస్య ఇలాగే కొనసాగుతుందా అనేది తెలియాల్సి ఉంది.

## పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లను విడుదల చేసేందుకు చర్యలు చేపట్టిందని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారని అన్నారు . కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి, ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, పరిహారం చెల్లింపు, పునరావాసానికి సంబంధించిన ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కరించాలని సూచించారు. రైతులకు చెల్లించాల్సిన పరిహారం, పునరావాసానికి సంబంధించిన అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని, భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పనులు సజావుగా కొనసాగేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇరిగేషన్ , భూసేకరణ అధికారులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి





(మొదటి పేజీ తరువాయి...)

ప్రధాన భవనాలు, హాస్టల్ భవనాలు, ఆసుపత్రి, తరగతి గదులు, ల్యాబొరేటరీ బ్లాక్ తదితర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. బాయ్స్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులు దాదాపు తుదిదశకు చేరుకున్నాయని, మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. వైద్య కళాశాల నిర్మాణానికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించిన కలెక్టర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న అంతర్గత రహదారులు, లైబ్రరీ, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, విద్యార్థుల వసతి తదితర మౌలిక సదుపాయాలపై అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రతి సంవత్సరం 150 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం నర్సింగ్ కళాశాలలో బోధన కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, వసతి, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై కలెక్టర్ ఆరా తీశారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు సమకూరుతున్నాయా, ఇంకా ఏవైనా అదనపు వసతులు అవసరమా అనే అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం జిల్లాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టు అని అన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, ప్రతి పనికి నిర్దిష్ట కాలపరిమితిని నిర్దేశించుకుని ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్ నిర్మాణ పనులను నెల రోజుల్లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మిగిలిన నిర్మాణ పనులను కూడా డిసెంబర్ నాటికి పూర్తిచేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులు, బోధనా సిబ్బంది, వైద్య సిబ్బందికి అవసరమైన అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత వైద్య, ఇంజినీరింగ్, నిర్మాణ శాఖల అధికారులు, నర్సింగ్ కళాశాల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియలో రైతులతో సమన్వయం చేసుకోవాలి





(మొదటి పేజీ తరువాయి...)

కెనాల్ నిర్మాణానికి సంబంధించిన అలైన్‌మెంట్ తదితర అంశాలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. హేమచంద్రపురం, కారుకొండ గ్రామాల పరిధిలో సుమారు 191.25 ఎకరాల భూమిని సర్వే చేయాల్సి ఉండగా, సుమారు 7.50 కిలోమీటర్ల మేర డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. భూ సర్వే పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న కలెక్టర్‌కు, ఇప్పటివరకు సుమారు 6 ఎకరాల మేర భూ సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన భూములకు సంబంధించిన సర్వేను వేగవంతంగా పూర్తి చేసేందుకు చేపడుతున్న చర్యలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ప్రతిపాదిత అలైన్‌మెంట్‌ను పరిశీలించిన కలెక్టర్, సర్వే ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ సర్వే పనులను ప్రతిరోజూ ఉదయం 8 గంటలకే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వే బృందాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన సిబ్బందిని సమన్వయం చేసుకొని పనులను నిరంతరం కొనసాగించాలని సూచించారు. వారం రోజుల్లోగా మొత్తం భూ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. సర్వే పనుల పురోగతిని ప్రతి రోజూ సమీక్షిస్తూ, నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే సమయంలో భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర సంబంధిత వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. భూ సర్వేకు సంబంధించి రైతులకు ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం రైతులతో జిల్లా కలెక్టర్ మాట్లాడారు. భూ సర్వే ప్రక్రియకు సహకరించాలని, అధికారులు నిర్వహించే సర్వే సమయంలో అవసరమైన సమాచారం అందించాలని రైతులను కోరారు. ప్రాజెక్టు పనుల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని భూసేకరణ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా అధికారులకు సహకరించాలని సూచించారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా సాగునీటి వసతుల విస్తరణకు సంబంధించిన పనుల్లో భూసేకరణ, భూ సర్వే కీలకమైన అంశాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం ఆర్డీవో మధు, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, సర్వే అధికారులు, ఇరిగేషన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ములకలపల్లి వెళ్లే 33 కెవి విద్యుత్తు లైన్ ను దమ్మపేట రోడ్డుకు మార్చాలి

**దమ్మపేట వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలను మరమ్మతులు చేయాలి**

**డిప్యూటీ మేయర్ లలిత కుమారికి బి ఆర్ ఎస్ నాయకుల వినతి**



**కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 21 , (ప్రజా జ్యోతి)** పాల్వంచ పట్టణంలోని అయ్యప్ప నగర్, శ్రీనివాస కాలనీ మీదుగా ములకలపల్లి కి వెళ్లే 33KV. విద్యుత్ లైన్ ను దమ్మపేట మెయిన్ రోడ్డు కు మార్పించాలని, దమ్మపేట రోడ్డు ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను మరమ్మతులు చేయించి, మురుగునీటిని రోడ్డు ప్రక్కన నిల్వలేకుండ చెయ్యాలని, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యుటీ మేయర్ లలిత కుమారి కి గురువారం బి ఆర్ఎస్ నాయకులు కాల్వ ప్రకాష్ రావు ఆధ్వర్యంలో పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. దమ్మపేట రోడ్డు లో గల జమ్ముల. సీతారామిరెడ్డి స్వగృహానికి వచ్చిన వచ్చిన డిప్యూటీ మేయర్ లలిత కుమారిని కాల్వ ప్రకాష్ తో పాటు పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు మర్యాద పూర్వకగా కలసి వినతి పత్రాన్ని అందజేశారు , అందుకు స్పందించిన మేయర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు, అదేవిధంగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్తు లైన్ ను మార్చే విధంగా చూస్తామన్నారు, డిప్యూటీ మేయర్ ను కలిసిన వారిలో సత్యనారాయణ, జేసీబీ మధుసూదన్ రెడ్డి, రాజేంద్రకుమార్, కె సంజీవ రావు, మంగీలాల్, నారాయణ రెడ్డి, పెంకె శ్రీను, జెట్టి. ఆనందరావు, కృష్ణారెడ్డి, బిక్షం, పుష్పరాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో అమ్మవారి పూజ..ఆధ్యాత్మిక శోభ



**ఆళ్ళపల్లి, ఆగస్టు 21(ప్రజా జ్యోతి)** శ్రావణ మాసం శుక్రవారాన్ని పురస్కరించుకొని ఆళ్ళపల్లిలో అమ్మవారి వరలక్ష్మి పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని పూలమాలలు, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు.ఈ పూజా వేదికను అరటి ఆకులు, పుష్పాలతో అందంగా అలంకరించి, అమ్మవారి సన్నిధిలో దీ పాలను వెలిగించారు. పండ్లు, పిండి వంటలు, వివిధ రకాల నైవేద్యాలను సమర్పించి అమ్మవారికి మంగళహారతి ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులు, భక్తులు అమ్మవారి ఆశీస్సులు కోరుతూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించా రు.శ్రావణమాసంలో వరలక్ష్మి వ్రతం విశిష్టత ఉండటంతో మహిళలు సౌభా గ్యం, కుటుంబ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని కో రుకుంటూ అమ్మవారిని ప్రార్థించారు. పూజా కార్యక్రమం సందర్భంగా ఇంటి పరిసరాలు భక్తి వాతావరణాన్ని సంతరించుకున్నాయి.అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రతి ఇంటిపై ఉండాలని.. కుటుంబాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని భక్తులు ఆకాంక్షించారు.

## తుది శ్వాస వరకు విప్లవోద్యమంలో.. కామ్రేడ్ సత్యన్నకు ఘన నివాళి

**ఆళ్ళపల్లి,ఆగస్టు 21 (ప్రజాజ్యోతి)**సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఇల్లెందు డివిజన్ కమిటీ సభ్యుడు, ఆళ్ళపల్లి కి చెందిన కామ్రేడ్ బత్తిని సత్యన్న క్యాన్సర్‌తో పోరాడుతూ గురువారం రాత్రి 11.30గంటలకు మృతి చెందారు. శుక్రవారం ఆయన భౌతికకాయానికి న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, ఖమ్మం జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య, ఇల్లెందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.మండల కార్యదర్శి బట్టు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో నాయకులు మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారం కోసం సత్యన్న చేసిన సేవలు చిరస్మరణీయమని, తుది శ్వాస వరకు విప్లవోద్యమంలో క్రమశిక్షణతో పనిచేశారని కొనియాడారు. ఆయన మృతి పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. సత్యన్న ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.సీపీఐ జిల్లా నాయకుడు రేసు ఎల్లయ్య, గుండాల మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, కాచనపల్లి సర్పంచ్ జరుపుల కిషన్ తదితరులు సత్యన్నకు నివాళులర్పించారు. ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించి జోహార్లు అర్పించారు. న్యూడెమోక్రసీ, ప్రజాసంఘాల నాయకులు గౌని నాగేశ్వరరావు, జె. సీతారామయ్య, కొక్కు సారంగపాణి, డి. ప్రసాద్, పూనేం రంగయ్య, ఎం.డి. రాసుద్దిన్, మెస్సు గోపాల్, కొమరం సత్యనారాయణ, అటికం శేఖర్, పొడుగు నరసింహారావు, ఎట్టి నరసింహారావు,ఈశ్వరోజు బుచ్చిరాజాం యాసారపు వెంకన్న, పర్షిక రవి తదితరులు పాల్గొన్నారు.



## పాల్వంచలో ఘనంగా సిద్ది వెంకటేశ్వర్లు నాలుగో వర్ధంతి

**అలుపెరగని పోరాట యోధుడు సిద్ది వెంకటేశ్వర్లు**

**పార్టీకి, ప్రజలకు సిద్ది అందించిన సేవలు చిరస్మరనీయం**

**సీపీఐ జిల్లా కార్యదర్శి SK సాబీర్ పాషా**



**కొత్తగూడెం కలెక్టరేట్ , పాల్వంచ /ఆగస్టు 21,(ప్రజా జ్యోతి)** స్వార్థప్రయోజనాల కోసం జెండాలు, ఎజెండాలు మారుస్తూ రాజకీయాలను మలినం చేస్తున్న ప్రస్తుత తరుణంలో అందుకు భిన్నంగా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి కడదాకా ఒకే జెండాతో మమేకమైన కమ్యూనిస్టు, అలుపెరగని పోరాట యోధుడి సిద్ధి వెంకటేశ్వర్లు అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా అన్నారు. శుక్రవారం సిపిఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ కార్యదర్శి సిద్ధి వెంకటేశ్వర్లు 4వ వర్ధంతి సందర్భంగా పాల్వంచలో సిద్ధి స్మారక విగ్రహం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తొలుత సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం సీపీఐ పతకాన్ని ఆవిష్కరించారు, ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజా ఉధ్యమాలను తారాస్థాయికి చేర్చి పార్టీ బలోపేతానికి బాటలు వేసిన ప్రజానాయకుడు సిద్ధి అని ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థిసంఘం మొదలు యువజన, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర నేతగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శిగా, రాష్ట్రసహాయ కార్యదర్శిగా అనేక పదువులను చేపట్టి ఆ పదవులకే వన్నెతెచ్చిన అరుదైన నాయకుడు అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో జన సేవాదళ్ బాధ్యునిగా వేలాది మంది ఎర్ర సైనికులను తయారు చేసి ప్రజాఉద్యమాలకు ఊపిరి పోసిన చరిత్ర సిద్ధిది అని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో బలమైన భూ పోరాటాలు నిర్వహించి వేలాది "ఎకరాల భూమిని పేదలకు పంచారని అన్నారు, ఉమ్మడి జిల్లాలో ఆయన పిలుపుతో "ఎందరో పార్టీలోనికి వచ్చి నేటికీ కొనసాగుతున్నారని చెప్పారు. దేశంలో కార్పోరేట్ శక్తులకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించి వ్యాపారులను చైతన్య చేశారని, కానీ ఆ రోజుల్లో కొందరు దీనిని పెడచెవిన పెట్టారని, కానీ నేటి పరిస్థితులను చూసి వ్యాపారులు కమ్యూనిస్టుల మాటలు మననం చేసుకుంటూ కమ్యూనిస్టుల ఆవసరాన్ని గుర్తిస్తున్నారని చెప్పారు. సిద్ధి ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు వేముల కొండలరావు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, కార్పొరేటర్ బోయిన్ విజయ, ప్రజాసంఘాల నాయకులు వల్లెపు యాకయ్య, ఆలపాటి ప్రసాద్, సత్యనారాయణ, భూక్యా విజయ, వేములపల్లి రాజశేఖర్, ఇరుకులపాటి సుధాకర్, రామాచారి, రాము, వెంకట్, బాబు, కిరణ్, వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు కనగాల అనంతరములు, దుప్పలపూడి సురేష్ బాబు, మానస శ్రీను, ఇటుకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం



**ఇల్లందు, ఆగస్ట్ 21 (ప్రజా జ్యోతి )**మున్సిపల్ పరిధిలోని 22వ వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివకిరణ్ ఆధ్వర్యంలో స్థానిక సూపర్ బజార్ ఏరియా అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, వారికి దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారుల జీవితంలో విద్యాభ్యాసానికి తొలి అడుగు అంగన్వాడి కేంద్రాల నుంచే ప్రారంభమవుతుందని, చిన్న వయసులోనే విద్య పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యం, పరిశుభ్రత, క్రమశిక్షణ వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. ప్రతి చిన్నారికి మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు తల్లిదండ్రులు, అంగన్వాడి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ అజ్మీర సక్కుబాయి, ఆశా వర్కర్ చెడుపాక కరుణ, కాంగ్రెస్ నాయకురాలు కొల్లపురి ఝాన్సీ, మహిళలు పాల్గొన్నారు.

## ఆగస్టు 23 చలో హైదరాబాద్‌కు కార్యక్రమనికి తరలిరావాలి



**ఆళ్ళపల్లి,ఆగస్టు 21(ప్రజా జ్యోతి)**కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం రద్దు కోరుతూ ఆగస్టు 23న నిర్వహించనున్న “చలో హైదరాబాద్” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగుల సంఘం ఆళ్ళపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో గోడపత్రికను ఆవిష్కరించారు.2004 నుంచి నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలవుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం వల్ల పదవీ విరమణ అనంతరం తక్కువ మొత్తంలో పింఛన్ వచ్చే పరిస్థితి ఏర్పడుతోందని, వృద్ధాప్యంలో ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చినందున ఆ హామీని అమలు చేయాలని కోరారు. ఈ నెల 11న భద్రాచలం నుంచి ప్రారంభమైన జనజాగరణ బస్సు ర్యాలీ 33 జిల్లాల మీదుగా కొనసాగి ఆగస్టు 23న హైదరాబాద్ చేరుకోనుందని తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులంతా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శాంతారావు, సముదాయ ప్రధానోపాధ్యాయుడు బాబూలాల్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, రమేష్, హథీరాం, లక్ష్మణ్, బాబూలాల్, నరసింహారావు ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి యువకుడు మృతి



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండలం లోని పెంట్లం గ్రామానికి చెందిన ఇనపనూరి సంతోష్ (35) గ్రామ సమీపంలోని చెరువుకు ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. సంతోష్ టాపీ మేస్త్రిగా పని చేస్తూ సుమారు 20 నుంచి 30 మందికి ఉపాధి కల్పిస్తూ జీవనం సాగించేవాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంతోష్ మృతితో పెంట్లం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

## దోమల నివారణకు గ్రామంలో ఫాగింగ్

**వర్షాల నేపథ్యంలో దోమల వ్యాప్తి నివారణకు చర్యలు**



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 21 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమం చేపడుతున్నట్లు సర్పంచ్ లాకవత్ లక్ష్మి, ఉప సర్పంచ్ మారగాని అశోక్ తెలిపారు. ప్రస్తు తం వర్షాలు కురుస్తుండటం తో దోమల వ్యాప్తి పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించి దోమల వ్యాప్తిని నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాల్లో చెత్తాచెదారం లేకుండా చూసుకోవడంతో పాటు నీటి నిల్వలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామస్తులు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని సర్పంచ్, ఉప సర్పంచ్ తెలిపారు.

## అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం తరలింపులో ఏడుగురిపై కేసు నమోదు

**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 21 ,(ప్రజా జ్యోతి)** ఈనెల 15న పాల్వంచ పట్టణంలోని స్థానిక అల్లూరి సెంటర్లో అక్రమంగా తరలిస్తున్న 300 కింటాల రేషన్ బియ్యాన్ని పాల్వంచ పోలీసులు పట్టుకున్నారు, పట్టుకున్న రేషన్ బియ్యం పై బియ్యాన్ని తరలిస్తున్న లారీ డ్రైవర్ కాజా మొయినుద్దీన్ ను పోలీసులు, విచారణ చేయగా గురువారం ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

**పట్టుబడిన వారిలో**

1.నరిగే రవీంద్ర – రామాంజనేయ రైస్ మిల్ యజమాని
2.కొండ్లే వెంకటేశ్వరరావు – పాల్వంచ బ్రోకర్
3.విదియాల శ్రీను – మిర్యాలగూడ బ్రోకర్
4.నూతక్కి వాసు – ధీరజ్ రైస్ మిల్స్, మిర్యాలగూడ
5.ఎస్.కె. పాషా – లారీ యజమాని
6.అసోదు సుధాకర్ – తండ్రి వెంకట నర్సు, లారీ యజమాని ఏజెంట్.
ఉన్నట్లు తెలిపారు.

## కొత్తగూడెం ఆర్టిసి బస్టాండ్ లో గంజాయి కలకలం

**20 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించిన పోలీసులు**

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 21,(ప్రజాజ్యోతి)** కొత్తగూడెం ఆర్టిసి బస్టాండ్ లో సుమారు 20 కేజీల గంజాయి ఉన్నట్లు కొత్తగూడెం వన్ టౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి గుర్తించినట్లు సమాచారం , ఇందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి, కొత్తగూడెం బస్టాండ్ లోని డిసి రూమ్ పక్కన దాచి ఉంచిన సుమారు 20 కిలోల బరువున్న 13 గంజాయి ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు, పోలీసులకు అందిన సమాచారం మేరకు రెండు రోజుల క్రితమే బస్టాండ్ లో తనిఖీలు చేసినప్పటికీ ఎలాంటి ఫలితం లభించలేదు, దీంతో శుక్రవారం సాయంత్రం పోలీసులు డాగ్ స్క్వాడ్ తో మరోసారి బస్టాండ్లో తనిఖీలు చేపట్టగా బీసీ రూమ్ వద్ద గంజాయి లభించకపోవడంతో డిఎస్పి ఆదినారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ,దీంతో ఆర్టీసీ డిపో మేనేజర్ డిఎం రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు సిబ్బంది ఆ గంజాయి బ్యాగును పోలీసుల కు అప్పగించారు ,ఈ గంజాయి బ్యాగు బస్టాండ్కు ఎప్పుడు వచ్చింది, ఎవరు తీసుకొచ్చారు ,అనే విషయంపై పోలీసులు విచారిస్తున్నారు, దొరికిన గంజాయి పై ఆర్టీసీ సిబ్బంది ప్రమేయం ఏమైనా ఉందా ? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు, అయితే రెండు రోజుల క్రితం పోలీసులు గంజాయి కోసం తనిఖీ చేసిన సమయంలో తాను అందుబాటులో లేనని సమావేశంలో ఉన్నట్లు డి ఎం రాజలక్ష్మి పోలీసులకు వివరణ ఇచ్చారు.

# సర్కారు దవాఖానకు కార్పొరేట్ వైద్యం

**ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని కృషి**

**కొత్తగూడెంలో త్వరలో క్యాథ్ ల్యాబ్**

**జీజీహెచ్‌కు రూ. 3 కోట్ల నిధుల మంజూరు**



**కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 21,(ప్రజా జ్యోతి)**

కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు, అదేవిధంగా జిల్లా ప్రజలకు మెరుగైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన విశేష కృషి ఎట్టకేలకు ఫలించింది. పేద, మధ్యతరగతి ప్రజలకు అధునాతన వైద్యం అందుబాటులో ఉంచాలనే సంకల్పంతో ఆయన ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెచ్చి ప్రత్యేకంగా రూ. 3 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో అత్యాధునిక సౌకర్యాలు సమకూరనున్నాయి.ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడే రోగుల ప్రాణాలను కాపాడేందుకు కీలకమైన అధునాతన క్యాథ్ ల్యాబ్ సేవలను ఇక్కడ త్వరలోనే ప్రారంభించనున్నారు. దీంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ)ను ఏర్పాటు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం పేదలు ప్రైవేట్ కేంద్రాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేయకుండా ఆస్పత్రిలోనే అత్యాధునిక ఎంఆర్ఐ స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడే రోగుల కోసం అన్ని హంగులతో కూడిన 20 పడకల ఐసీయూ విభాగాన్ని కూడా నిర్మిస్తున్నారు. గతంలో గుండెపోటు లేదా ఇతర తీవ్రమైన అత్యవసర పరిస్థితులు ఏర్పడితే మెరుగైన వైద్యం కోసం రోగులు సుదూర ప్రాంతాలైన హైదరాబాద్, ఖమ్మం వంటి నగరాలకు పరుగులు తీయాల్సి వచ్చేది. సకాలంలో వైద్యం అందక మార్గమధ్యలోనే ఎందరో నిస్సహాయ స్థితిలో ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు జీజీహెచ్‌లోనే కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ఈ అన్ని రకాల అత్యున్నత వైద్య వసతులు సమకూరనుండటంతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరగనుంది. ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుంటూ, సర్కారు దవాఖానను సూపర్ స్పెషాలిటీ స్థాయిలో తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే కూనంనేని చొరవపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేద రోగులకు ప్రాణవాయువులాంటి ఈ సౌకర్యాలను సాధించి చూపిన కూనంనేని సాంబశివరావు నాయకత్వంపై ప్రజలు, ప్రజా సంఘాలు, కార్మికులు సర్వత్రా ప్రశంసలు కురిపిస్తున్నారు.

# సి.వి.కె. రావు సేవలు చిరస్మరణీయం






**ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

**చర్ల, ఆగస్టు 21:(ప్రజా జ్యోతి):** చర్ల మండలం రైస్ పేట గ్రామంలో ప్రముఖ రాజకీయ నాయకులు, సా మాజికవేత్త, విద్యావేత్త కీ.శే. సి.వి.కె. రావు 5వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు హాజరై సి.వి.కె. రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చర్ల మండల అభివృద్ధికి సి.వి.కె. రావు విశేష కృషి చేశారని అన్నారు. రాజకీయాల్లో ముందుండి ప్రజా సమస్యల పరిష్కారానికి, మండల అభివృద్ధికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. చర్ల మండల ప్రజలు ఆయన సేవలను ఎన్నటికీ మరువరని అన్నారు.సి.వి.కె. రావు ఆశయాలను, ప్రజాసేవా స్ఫూర్తిని ఎమ్మెల్యే కొనియాడుతూ ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఈవో దామోదర్, టీపీసీసీ కార్యదర్శి నాగ సీతారాములు, నల్లపు దుర్గా ప్రసాద్, చర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్ నాయుడు, నియోజకవర్గ ప్రముఖులు, న్యాయవాదులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య పాఠశాల వద్ద ఉద్రిక్తత

**బదిలీ కాదు.. విధుల నుంచి తొలగించాలి**

**విద్యార్థులపై దాడి ఆరోపణలతో ఆదివాసీ సంఘాల ఆందోళన**



**గుండాల ఆగస్టు 21 ,(ప్రజా జ్యోతి) :** గుండాల ఏకలవ్య పాఠశాల వద్ద శుక్రవారం ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ పాఠశాలలో తీజ్ పండుగ నిర్వహించిన ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులను బదిలీ చేసినా చర్యలు సరిపోవని, వారిని విధుల నుంచి తొలగించాలని వాళ్లు డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల నాయకులు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. అయితే దీక్ష కొనసాగుతున్న సమయంలో పాఠశాలలో చదువుతున్న ఇద్దరు ఆదివాసీ విద్యార్థులు గేటు వద్దకు వచ్చి లంబాడీ విద్యార్థులు తమపై దాడి చేశారని నాయకులకు తెలిపారు. దీంతో ఆదివాసీ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలపై దాడి జరుగుతున్నా పాఠశాల యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ పాఠశాల గేటు వద్ద ఆందోళనకు దిగారు. కొందరు నాయకులు గేటు ఎక్కేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అయితే సమాచారం అందుకున్న ఇల్లందు డీఎస్పీ వెంకన్నబాబు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గుండాల సీఐ తిరుపతి, ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఇప్పటికే బందోబస్తు చేపట్టారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. దీంతో పాటు కలెక్టర్ ఆదేశాల మేరకు ఐటీడీఏ ఆర్‌సీఓ అరుణకుమారి, ఏపీఓ డేవిడ్ పాఠశాలకు చేరుకుని ఆదివాసీ సంఘాల నాయకులతో చర్చించారు. విద్యార్థులపై దాడి ఆరోపణలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను విచారించేందుకు అధికారులు, పోలీసులు పాఠశాలలోకి వెళ్లారు. అయితే ప్రధానంగా వైస్ ప్రిన్సిపాల్ ను బదిలీ చేయడం కాకుండా విధుల నుంచి పూర్తిగా తొలగించే వరకు ఆమరణ నిరాహార దీక్ష విరమించేది లేదని ఆదివాసీ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈ అంశంపై ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఆదివాసీ ప్రజాప్రతినిధులు, మంత్రి సీతక్క నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆళ్లపల్లి ఎస్సై సోమేశ్వర్, బూర్గంపాడు ఎస్సై రాజమౌళి, కాచనపల్లి ఎస్సై నాగులు మీరా తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. మహిళా పోలీసులను కూడా మోహరించారు. విద్యార్థులపై దాడి జరిగిందన్న ఆరోపణలపై అధికారులు విచారణ చేపట్టారు.

